
సాక్షి
గుంటూరు
బుధవారం ; 19 ; ఫిబ్రవరి ; 2025



పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

కారెంపూడి: 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికకు కారెంపూడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు మంగళవారం తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 536.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదలవుతోంది.



'ఫేస్ వాష్ అండ్ గో'

నరసరావుపేట: ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. మంగళవారం రాత్రి పలువురు డ్రైవర్లకు నీళ్లు ఇచ్చి పోలీసులు ముఖం కడిగించారు.

న్యూస్‌రీల్

పెళ్లి కొడుకుగా మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 18 నుంచి 27 వరకు జరిగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం స్వామి పెళ్లి కుమారుడి ఉత్సవం శోభాయమానంగా నిర్వహించారు. స్వామికి గణపతి పూజ, పంచామృత అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని పెళ్లికుమారుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన చంద్రిక జ్యూయలర్స్ అధినేత జంజనం నాగేంద్రరావు, విజయలక్ష్మి దంపతులు ఈ ఉత్సవానికి కైంకర్యకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్లు బోగి కోటేశ్వరరావు, సీతారామ కోవెల ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ వాకా మంగారావు తదితరులు పాల్గొన్నారు. దేవస్థాన కార్య నిర్వహణాధికారి జె.వి.నారాయణ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



కొల్లి కాంతమ్మ (ఫైల్ ఫొటో)

కొల్లిపర: కొల్లిపర గ్రామంలో 105 సంవత్సరాలు కలిగిన కొల్లి కాంతమ్మ సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. కాంతమ్మ భర్త కొల్లి సుబ్బారెడ్డి స్వాత్రంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు శిక్ష అనుభవించారు. కాంతమ్మకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలతోపాటు మనవలు, మనవరాళ్లు, మునిమనవలు ఉన్నారు. ఈమె ఐదు తరాలను చూసింది.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం గత ఏడాది నవంబరులో నిర్వహించిన ఎంఏ తెలుగు ప్రథమ, ద్వితీయ, తృతీయ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశామని పీజీ పరీక్షల విభాగ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోదండపాణి తెలిపారు. పరీక్ష ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈఐఎన్‌ఎఫ్ఓ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని వెల్లడించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 28 ఆఖరు తేదీగా నిర్ణయించామని వివరించారు.

ఎం ఫార్మసీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించనున్న ఎం.ఫార్మసీ వన్ బై టూ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను సీఈఏ శివప్రసాద రావు మంగళవారం విడుదల చేశారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 25 చివరి తేదీ. రూ.100 ఆలస్య రుసుముతో ఈ నెల 27 వరకు చెల్లించవచ్చునని, పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. పరీక్ష ఫీజు తదితర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంక్ మేనేజర్ మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ వారధిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బ్యాంకు మేనేజర్ చనిపోయిన ఘటనపై మంగళవారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం చీరాలకు చెందిన కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు (40) కృష్ణాజిల్లా పెడనలోని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై భార్య అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


అమరేశ్వరుని సేవలో క్యాట్ న్యాయమూర్తి

అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని మంగళవారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) న్యాయమూర్తి లతా భరద్వాజ్ దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట క్యాట్ మెంబర్ వరణ్‌సింధు కౌముది, అధికారులు ఉన్నారు.

ఏముంధరనో..!

ఘాటైన మిర్చి సాగుకు గుంటూరు ప్రసిద్ధి అయితే.. దీటైన ధర ఇవ్వడంలో మిర్చి యార్డు పెట్టిందిపేరు. ఇక్కడి పంటకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. గత నాలుగేళ్లు లాభాలు చూసిన రైతుల కన్నులు.. ఇప్పుడు కనీస ధర లేక చెమరుస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచీ ధరలు రోజురోజుకూ నేలచూపులు చూస్తుండడంతో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా యార్డులో రైతులు దోపిడీకి గురవుతున్నారు. అయినా కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మిర్చి యార్డుకు రానున్నారు. కర్షకుల కష్టాలు అడిగి తెలుసుకుని అండగా నిలవనున్నారు. రైతుల తరపున కూటమి సర్కారు అలక్ష్యంపై గళమెత్తనున్నారు.

- మిర్చి రైతుల గగ్గోలు
- దారుణంగా పతనమైన ధరలు
- రోజురోజుకూ నేల చూపులు చూస్తున్న వైనం
- దిగుబడులూ అంతంతమాత్రమే
- యార్డులో దోపిడీకి గురవుతున్న కర్షకులు
- పట్టించుకోని కూటమి సర్కారు
- కనీసం కూలీల ఖర్చు మిగలని దుస్థితి
- వైఎస్సార్ సీపీ హయాం మిరప పంటకు స్వర్ణయుగం
- నేడు మిర్చి యార్డుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కర్షకుల కష్టాలు అడిగి తెలుసుకోనున్న జననేత



గుంటూరు మిర్చి యార్డు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, కొరిటెపాడు: రాష్ట్రంలో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు (పల్నాడు, గుంటూరు) జిల్లాతోపాటు ప్రకాశం, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాల్లో సుమారు 1.96 లక్షల హెక్టార్లలో మిర్చి సాగైంది. 11.67 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు అంచనా వేశారు. అయితే ఈ ఏడాది దిగుబడులు దారుణంగా పడిపోయాయి. ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ మాత్రం కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తామర, జెమినీ వైరస్‌ల ప్రభావంతో పాటు వాతావరణ మార్పులే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.



వేమెన్స్ లేకుండా మిర్చి తూకం వేస్తున్న గుమాస్తాలు

జగనన్న పాలనలో రికార్డు స్థాయిలో ధరలు..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాలుగేళ్లు మిర్చి రైతులకు స్వర్ణయుగమని చెప్పాలి. రికార్డు స్థాయిలో ధరలు లభించాయి. వైఎస్సార్ సీపీ హయాంలో దిగుబడులు బాగా వచ్చాయి. ఎకరాకు 20 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అప్పట్లో రైతులు సీజన్‌కు ఐదు నుంచి ఆరు కోతలు కోసేవారు. ఈ ఏడాది రెండు, మూడు కోతలతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి.

ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడి

గతంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి సాగు పెట్టుబడులూ భారీగా పెరిగాయి. ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీలు, రవాణా ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఫలితంగా ఎకరాకు రూ.1.50 లక్షల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులైతే పెట్టుబడి మరింత పెరుగుతుంది. పెట్టుబడి పెరిగి దిగుబడి సరిగా రాక సతమతమవుతున్న రైతులపై ఇప్పుడు గోరుచుట్టుపై రోకటిపోటులా ధరలు మంట పుట్టిస్తున్నాయి. యార్డులో పలుకుతున్న ధరలను చూసి కర్షకులు కన్నీరు కారుస్తున్నారు. నాలుగైదు నెలలుగా ఇదే దుస్థితి ఉండంతో ఆవేదన చెందుతున్నారు.

'మచ్చు'కైనా దయలేదు!

అసలే సరైన ధర లేక అల్లాడుతున్న రైతులపై అధికారులు మచ్చుకైనా దయ చూపడం లేదు. మిర్చి యార్డులో మచ్చుకాయల దోపిడీని అరికట్టలేక చోద్యం చూస్తున్నారు. మరో వైపు వేమెన్స్ లేకుండానే దిగుమతి వ్యాపారుల గుమాస్తాలు కాటాలు వేస్తూ తూకంలో మోసం చేస్తున్నారు. ఆ తర్వాత వేమెన్లు వచ్చి బిల్లులు ఇస్తున్నారు. దిగుమతి వ్యాపారులు కమీషన్ పేరుతోనూ దండుకుంటున్నారు. వాస్తవానికి రెండుశాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా, కొందరు నాలుగు నుంచి ఆరు శాతం వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.



మచ్చు కాయలు తీసుకెళ్తున్న దృశ్యం

ధరలు ఎందుకు తగ్గాయంటే..

తెలుగు రాష్ట్రాల మిర్చిని కొనుగోలు చేసే థాయిలాండ్, వియత్నాం, చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, బర్మా తదితర దేశాల్లోనూ కొంతమేర మిర్చి సాగు చేస్తుండడంతో గిరాకీ తగ్గింది. దీనికితోడు గత ఏడాది సాగు చేసిన 27 లక్షల బస్తాల మిర్చి శీతల గిడ్డంగులలో నిల్వ ఉండిపోవడం కూడా ధరలు తగ్గుదలకు ఒక కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టిన మిర్చికి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ సరుకును తక్కువ ధరకు అమ్ముకోవడానికి రైతులు సుముఖంగా లేరు. కొత్త సరుకుకు అనుకున్న మేర డిమాండ్ లేదు.

వైఎస్సార్ సీపీ, కూటమి ప్రభుత్వాల హయాంలో మిర్చి ధరల వ్యత్యాసమిలా..

మిర్చి రకాలు	2020-24 (క్వింటాకు రూ.వేలల్లో)	ప్రస్తుతం (క్వింటాకు రూ.వేలల్లో)
తేజ	21-26	10-13
డీలక్స్	20-25	10-12
సింజెంటా బ్యాడిగ	25- 36	10-13
341, 273	18-25	9-12

గిట్టుబాటు ధర కల్పించాలి..



నేను రెండెకరాల్లో తేజ రకం సాగు చేశా. రెండు ఎకరాలకు ఇప్పటి వరకు రూ.3.50 లక్షల వరకు పెట్టుబడైంది. గత ఏడాది ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 10 క్వింటాళ్లు మించి వచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది క్వింటా రూ.25 వేలు పలికిన ధర ఇప్పుడు రూ.13 వేలు మించి పలకడం లేదు. పెట్టుబడులు భారీగా పెరిగాయి. యార్డుకు 10 క్వింటాళ్ల మిర్చిని తెచ్చా. క్వింటా రూ.13 వేలు వేశారు. క్వింటాకు రూ.20 వేల నుంచి రూ.22 వేలు వస్తే పెట్టుబడి వస్తుంది. లేదంటే భారీ నష్టం తప్పదు.

–జి.సుబ్బయ్య, రైతు, మంగన్నపల్లే, పోరుమామిళ్ళ మండలం, కడప జిల్లా

20 రోజుల్లో క్వింటాకు రూ.3 వేలు తగ్గుదల



నేను 10 ఎకరాల్లో తేజ రకం సాగు చేశాను. ఎకరాకు కౌలుతో కలుపుకుని సుమారు రూ.2 లక్షల పెట్టుబడైంది. 20 రోజుల కిత్రం 70 క్వింటాళ్లు యార్డుకు తెచ్చా. క్వింటా రూ.15 వేలు ధర పలికింది. సోమవారం మరో 90 బస్తాలు తీసుకువచ్చా. కానీ రూ.10 వేలు నుంచి రూ.12 వేలు మాత్రమే అడుగుతున్నారు. ఏం చేయాలో అర్థం కాని దుస్థితి. 20 రోజుల్లో క్వింటాకు రూ.3 వేలు ధర తగ్గింది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర లభించేలా చూడాలి.

–కె.దేవేంద్ర, రైతు, నల్లచెలిమిల, దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా

గత ఏడాది క్వింటా రూ.25 వేలు



నేను రెండు ఎకరాల్లో తేజ రకం సాగు చేశా. గత ఏడాది ఎకరాకు 30 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 15 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితులు లేవు. ఎకరాకు రూ.2.30 లక్షలు వరకు ఖర్చు చేశాను. ప్రస్తుతం 17 బస్తాలు ఎరుపు కాయలు తెచ్చా. క్వింటాకు రూ.13,400 ధర పలికింది. ఇవే కాయలు గతేడాది క్వింటా రూ.25 వేలు వరకు పలికాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

–వై.దేవదాసు, రైతు, నీలగంగవరం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా

గ్రీన్ గ్రేస్‌పై తప్పుడు ఆరోపణలు

వైఎస్సార్ సీపీ నేత అంబటి మురళీకృష్ణ



విలేకరుల సమావేశంలో అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు (గుంటూరు వెస్ట్): గ్రీన్‌గ్రేస్ ప్రాజెక్టుపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని వైఎస్సార్ సీపీ నేత అంబటి మురళీకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనపై పోటీ చేసి గెలిచిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ రెండుమూడు నెలల నుంచి పలు రకాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ ఆరోపణలపై పత్రికాముఖంగా స్పందించడంతో తాను వివరణ ఇస్తున్నట్లు వివరించారు. 2015లో భజరంగ్ జూట్‌మిల్లుకు రెసిడెన్షియల్ సైట్ 5.28 ఎకరాల్లో ఒక హైరైజ్ ప్రాజెక్టు నిర్మించాలని అప్పటి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్ణయించిందని, మొదటగా ఐదు ఫ్లోర్లకు అనుమతి తీసుకోవాలని అనుకొని, మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. వారు ప్లాన్‌కు ముందు రైల్వే ట్రాక్ సైట్ 60 అడుగుల రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో ఉంది కనుక 164 చదరపు గజాల స్థలం గిఫ్ట్‌గా ఇవ్వమని కార్పొరేషన్ వారు ఎండార్స్‌మెంట్ ఇవ్వడంతో తాము అంగీకరించి ఆ మేరకు స్థలం ఇచ్చామన్నారు. నల్లపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 164 గజాలు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు గిఫ్ట్ డీడ్‌గా రిజిస్టర్‌చేసి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి ఇస్తూ 36వ పాయింట్‌గా కార్పొరేషన్ వారు రోడ్డు వేయడానికి తనను అడిగిన 164 గజాలు ఉచితంగా ఇచ్చాం గనుక రూ.19.30 లక్షలు సెట్‌బ్యాక్‌లో రిలాక్సేషన్ కింద ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు.


ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్సు కూడా తీసుకున్నాం

తర్వాత హైరైజ్ భవనాలు నిర్మించాలని నిర్ణయించి 2015 మే 26న 111 మీటర్ల హైట్ వరకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌ఓసీ తీసుకున్నామని, 2015లోనే స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ అథారిటీ నుంచి క్లియరెన్స్ తీసుకున్నామని అంబటి మురళీకృష్ణ వివరించారు. ఈ ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ 600 ప్లాట్లకు తీసుకున్నామని, ప్రస్తుతం తాను నిర్మిస్తుంది 510 ప్లాట్లని, దీనికి ఐదు సంవత్సరాలు వ్యాలిడిటీ ఉందని, తరువాత గజిట్ ద్వారా మరో ఐదేళ్లు పొడిగించుకోవచ్చని వివరించారు. తరువాత కోవిడ్‌లో ఒక సంవత్సరం సడలించడం వల్ల, 2026 వరకు అనుమతిలో ఉందని అంబటి పేర్కొన్నారు. ఆ తరువాత ఒక్కో టవర్‌కు ఒక్కోటి చొప్పున 2015లో గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్‌సర్వీసెస్ నుంచి ఫైర్ ఎన్‌ఓసీలు నాలుగు తీసుకున్నామని, ఒక్కో టవర్‌కు ఒకటి చొప్పున ఈ ఎన్‌ఓసీలు తీసుకున్న దరిమిలా 25 నవంబరు 2025లో రెండు సెల్లార్లు, ఒక గ్రౌండ్ ఫ్లోర్, 14 లివింగ్ ఫ్లోర్లకు అనుమతి తీసుకున్నట్టు వివరించారు. ఇది తీసుకున్న తరువాత 2020లో ప్రాజెక్టును ప్రారంభించామని, తర్వాత మూడు టవర్లకు వేర్వేరుగా రేరా అనుమతులు తీసుకున్నామని పేర్కొన్నారు. 2020లో 179 జీఓ ప్రకారం పోస్టు వెరిఫికేషన్ తొలగించి ఆటో వెరిఫై బై సూపర్‌వైజరీ చెక్ రూల్ ప్రకారం.. జీఎంసీ, డీటీసీపీ అధికారులు పరిశీలించి ఫైనల్ ప్లాన్‌గా ప్రకటించారన్నారు. 2020లో 96,000 స్క్వేర్ మీటర్‌లకు అనుమతి తీసుకుని అందులో ఐదు ఫ్లోర్‌లకు రూ.75 లక్షలు ఫీజు, తరువాత 2020లో 15 ఫ్లోర్‌కు రూ. 4.35 కోట్లు చెల్లించామన్నారు. హైరైజ్ బిల్డింగ్ కనుక పర్మినెంట్ ప్లాన్‌గా ఆమోదించామని పేర్కొన్నారు. ఆ తర్వాత 2024లో తాను ఒక టవర్‌లో కొన్ని మార్పులు చేయడం వల్ల మరో రివైజ్ ప్లాన్ తీసుకున్నట్టు వివరించారు. దీన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని దీనికి రూ.1.27 కోట్లు ఫీజు చెల్లించామని, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా బాకి లేదని పేర్కొన్నారు. అనుమతులు తీసుకున్నప్పుడు 15 శాతం బిల్డింగ్ ఏరియాను మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేశానని, భవిష్యత్‌లో నిబంధనలు అతిక్రమిస్తే ఆ 15 శాతానికి సమానమైన ఫ్లాట్లు వాళ్లు తీసుకుని తనకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారని వివరించారు.

మిగతా వారికి నోటీసులు ఇవ్వలేదేం..?

అన్ని అనుమతులు తీసుకున్న తర్వాత కొత్త జీవో ప్రకారం కొన్ని షార్ట్‌ఫాల్స్ ఉన్నాయని, తనకు ఒక షార్ట్‌ఫాల్ నోటీసు ఆన్‌లైన్‌లో ఇచ్చారని, దీంట్లో రకరకాల సాయిల్ టెస్ట్ రిపోర్ట్, రివైజ్డ్ ఫైర్ ఎన్‌ఓసీ, తరువాత రైల్వే శాఖ నుంచి ఎన్‌ఓసీ కావాలని తొలిసారి నోటీసులు ఇచ్చారని అంబటి పేర్కొన్నారు. రాజకీయ ప్రేరేపిత విమర్శలు వచ్చిన దగ్గర నుంచి రైల్వే ఎన్‌వోసీ కావాలంటూ పట్టుపట్టారని పేర్కొన్నారు. రైల్వేశాఖ ఎన్‌ఓసీ ప్రాసెస్‌లో ఉండగా తనకు నోటీసు ఇచ్చారన్నారు. షార్ట్‌ఫాల్ సబ్‌మిట్ చేయని 1187 మందికి నోటీసులు ఇవ్వకుండా తనకు మాత్రమే ఇవ్వడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కావాలని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, స్టాప్ నోటీసు ఇచ్చిన తర్వాత చట్టాన్ని గౌరవించి పనులు నిలిపివేశానని అంబటి స్పష్టం చేశారు. రైల్వే ఎన్‌ఓసీ విషయం కోర్టులో పెండింగ్‌లో ఉందని తీర్పు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. అన్ని నిబంధనల మేరకే చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

చింతపల్లి మేజర్‌కు సాగునీరు విడుదల



అచ్చంపేట: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసతండా వద్ద నాగార్జున సాగర్ కాలువల ద్వారా చింతపల్లి మేజర్‌కు సాగునీటి అవసరాలకు కెనాన్స్ ఏఈ చిల్కా భాస్కర్ ఆదేశాలతో మంగళవారం సాగునీటిని వదిలారు. చింతపల్లి మేజర్ కాలువ కింద ప్రస్తుతం మిర్చి, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు వేశారు. ఈ కాలువకు నీళ్లు రాకపోవడంతో రైతులు గత కొద్దికాలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నుంచే కస్తల మేజర్‌కు సాగునీటిని వదిలిన అధికారులు చింతపల్లి మేజర్‌కు వదలకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు శ్రీనివాసతండా నుంచి ఐదు రోజులు కస్తల మేజర్‌కు, ఐదు రోజులు కస్తల మేజర్‌కు సాగునీటిని మార్చి మార్చి వదిలే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

నేడు గుంటూరుకు వైఎస్ జగన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

- మిర్చియార్డులో రైతుల సమస్యల విననున్న జననేత
- వివరాలు వెల్లడించిన వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు (గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు వస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రైతులకు సంబంధించి గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టడంతోపాటు, రైతులకు భరోసా కల్పించేందుకు వైఎస్ జగన్ వస్తున్నారని వివరించారు. రైతులకు అండగా తానున్నాననే భరోసా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మిర్చి యార్డుకు వైఎస్ జగన్ ఉదయం 9.30 గంటలకు చేరుకుంటారని, మిర్చిని అమ్ముకునేందుకు వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు.

కూటమి ప్రభుత్వం విఫలం

కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల కాలంలో సీఎం చంద్రబాబు రైతులకు ఒక్క మేలు అయినా చేశారా అని అంబటి ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో బాబు విఫలమయ్యారని విమర్శించారు. ధాన్యం బస్తా ధర రూ.1200 నుంచి 1300, మిర్చి క్వింటా ధర రూ. 13వేలు కంటే పలకడం లేదని ధ్వజమెత్తారు. కంది, మినుము, పత్తి పంటలకూ మద్దతు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతుల సమస్యలపై కలెక్టర్లకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించినా సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని గుర్తుచేశారు. పొగాకు పంట విషయంలో రూ.వందల కోట్లు ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులకు మేలు జరగాలనే ఉద్దేశంతో పంట కొనుగోలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందన్నారు. వైఎస్ జగన్ రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వస్తున్నారని, ఇది బహిరంగ సభ కాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

రైతుల సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కూటమి నేతల కళ్ళు తెరిపించేందుకు, రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్ గుంటూరుకు వస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, డెప్యూటీ మేయర్, పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వై.ఎస్.జగన్ పర్యటన షెడ్యూల్ ఇలా..

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరు రానున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి బయల్దేరి, రోడ్డు మార్గంలో గుంటూరు మిర్చి యార్డుకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు మిర్చి యార్డు వద్దకు వచ్చి 11 గంటల వరకు మిర్చి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని, వారితో మాట్లాడతారు. అనంతరం 11 గంటలకు గుంటూరు మిర్చి యార్డు నుంచి బయలుదేరి తిరిగి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,400** గరిష్ఠం : రూ. **5,400**

మోడల్ ధర రూ. **5000**

క్లుప్తంగా

ప్రకృతి సేద్య ఖరీఫ్ కార్యాచరణపై అవగాహన కల్పించండి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రకృతి సేద్యం చేస్తున్న గ్రామ సంఘాల్లోని రైతులకు ఖరీఫ్ కార్యాచరణపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ చెప్పారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ కార్యాచరణ అమలుకు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, డీఆర్డీఏ శాఖలు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రగతి, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, డీఆర్‌డీఏ పీడీ విజయ లక్ష్మి, జిల్లా పశు సంవర్ధక అధికారి నరసింహారావు మాట్లాడుతూ కార్యాచరణ విజయవంతానికి కృషి చేస్తామన్నారు. రైతులు వట్టిచెరుకూరు ధనుంజయరావు, అత్తోట బాపయ్య, ఎరుకులపూడి విజయలక్ష్మి ప్రకృతి వ్యవసాయంలో తమ అనుభవాలను పంచుకున్నారు.

ఇఫ్కో కొత్త ఎరువు మార్కెట్‌లోకి విడుదల



కొరిటిపాడు(గుంటూరు): ఇఫ్కో వారు నూతనంగా తయారు చేసిన 28:28:0 అనే కాంప్లెక్స్ ఎరువును జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం గుంటూరు రూరల్ మండలం, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్ వద్ద మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 28:28:0 ఇఫ్కో వారు తెప్పించడం ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎరువుల విభాగం ఏడీఏ కేజేడీ రాజన్, గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కొల్లిపర ఏట వెంకట్రావు, ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీ'రింగ్ రింగ'

- మత్తు పదార్థాలు విక్రయిస్తూ పట్టుబడిన విద్యార్థులు
- 9 మంది అరెస్టు, పరారీలో ఇద్దరు
- బెంగళూరు నుంచి తక్కువ రేటుకు దిగుమతి
- గుంటూరులో అధిక ధరకు అమ్మకాలు
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీ డాక్టర్ కె శ్రీనివాసులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఇంజినీరింగ్ విద్యార్థులు రింగ రింగ అంటూ మత్తులో మునిగితేలుతున్నారు. నిషేధిత మత్తు పదార్థాలను సేవించడంతోపాటు వాటిని తక్కువ ధరకు కొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాలుగేళ్లుగా గుంటూరులో సాగుతున్న ఈ మత్తు దందా గుట్టును ఎక్సైజ్ శాఖ అధికారులు తాజాగా రట్టు చేశారు. ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు మంగళవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మంగళగిరి రూరల్ మండలం కాజకు చెందిన ఎం.సాయి కృష్ణ గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని సోదరుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. సాయి కృష్ణ సోదరుడి దగ్గరకు వెళ్లిన సమయంలో అతని రూంలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, తెనాలి చినరావూరుకు చెందిన ధరావత్ సతీష్‌కుమార్ పరిచయమయ్యాడు. సతీష్‌కుమార్ బెంగళూరుకు చెందిన నితిన్‌తో కలిసి ఎండీఎంఏ మత్తుమందును సేవించేవాడు. దీనిని సాయికృష్ణ కూడా అలవాటు చేసుకున్నాడు. ఈ మత్తు మందును గుంటూరులోనూ అమ్ముకోవచ్చని, లాభాలు పొందొచ్చని నితిన్ సతీష్‌కుమార్, సాయికృష్ణకు సూచించారు. దీంతో నితిన్ ద్వారా ఎండీఎంఏ మత్తు మందును నాలుగేళ్లుగా సాయి కృష్ణ, సతీష్ కుమార్ ఇద్దరూ గుంటూరు తీసుకొచ్చి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అమ్ముతున్నారు. సాయి కృష్ణ ఇటీవల గుంటూరు సమీపంలోని గోరంట్ల ప్రాంతంలో కోదండ రామా నగర్‌లోని సాయి లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకొని అక్కడి నుంచే దందా సాగిస్తున్నాడు.

బెంగళూరులో గ్రాము రూ.1400కు కొని..

ఎండీఎంఏ మత్తుమందును బెంగళూరులో గ్రాము రూ.1400కు కొని ఇక్కడికి తీసుకొచ్చి ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.4 వేల నుంచి రూ.ఐదు వేలకు అమ్ముతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. గుంటూరు సమీపంలోని ప్రధానంగా రెండు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఈ మత్తు మందును సాయి కృష్ణ అలవాటు చేసినట్లు తెలుస్తోంది. గోరంట్లలోని తన ఫ్లాట్‌లోకి విద్యార్థులను పిలిపించి మత్తు మందు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం. నాలుగేళ్లుగా ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్న సాయికృష్ణ తన గ్రామానికి చెందిన సమీప బంధువుతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ యశోధర దేవిని ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు. సీఐతో పాటు ఎస్ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుల్స్ హనుమంతరావు, సీహెచ్ రాజు, మైలా శ్రీనివాసరావు, రవిబాబు, బీఎస్ఎన్‌రాజు, పి నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వీవీ చారి, చిన్నబాబు తదితరులనూ అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్ రెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వి.అరుణ కుమారి, ఏఈఎస్ ఈడే మారయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

గుట్టురట్టు ఇలా..

రెండు రోజుల క్రితం గుంటూరు ఎక్సైజ్–2 టౌన్ సీఐ ఎం.యశోధర దేవి, ఆమె సిబ్బంది బృందావన్ గార్డెన్స్ సమీపంలోని వేంకటేశ్వర స్వామి గుడి రోడ్డులో తనిఖీ చేస్తుండగా ఇద్దరు ద్విచక్ర వాహనాన్ని ఆపి నిలబడి ఉన్నారు. అనుమానం వచ్చిన ఎక్సైజ్ అధికారులు వారిని ప్రశ్నించారు. ఇద్దరూ తడబడుతుండడంతో వారిని తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద 2.52 గ్రాముల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్కడ కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా సాయి కృష్ణ వద్ద కొన్నామని తెలిపారు. సాయి కృష్ణ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌కి వెళ్లి విచారించగా అతని వద్ద 8.15 గ్రాముల మత్తు మందుతోపాటు, ఒక కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు లభించాయి. అక్కడ ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇంకా గంజాయి సరఫరా చేస్తున్న సాయికృష్ణ బంధువు వేంపాటి చైతన్యతోపాటు బెంగళూరుకు చెందిన నితిన్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. వీరు పరారీలో ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

కేంద్రం రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎం.వి.ప్రసాద్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైల్వే శాఖ అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి ఎస్.మంజునాథ్, ఎం.వి ప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరాహార దీక్ష శిబిరంలో వారు మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సమస్యలను వివరించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు నినాదాలతో హోరెత్తించారు. కేంద్రం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డివిజన్ ట్రెజరర్ ఎస్.జి.కృష్ణయ్య, ఏడీఎస్ కె.కోటేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ట్రెజరర్ సాంబశివరావు, ఏడీఎస్‌లు కరుణశ్రీ, హక్, లావణ్య, సంఘ నాయకులు వెంకటేష్, సాయి కృష్ణ, కిరణ్, ప్రసాంత్, మూర్తి, టి.వి.రావు, సునీల్‌కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుల బాధ పట్టని కూటమి సర్కారు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మిర్చి పంటకు గిట్టుబాటు ధర దక్కక రైతులు అల్లాడుతుంటే కూటమి సర్కారు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా సర్కారు స్పందించాలని, లేకుంటే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్ర బడ్జెట్‌లో పేద, కర్షక, కార్మిక వర్గాలను విస్మరించారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ మాట్లాడుతూ మిర్చి ధర పతనం కావడంపై ఆందోళన వ్యక్తమవుతోందని వివరించారు. గత సంవత్సరం క్వింటాకు 23 వేల రూపాయలు పలికిన ధర ప్రస్తుతం రూ.10 వేలకు పరిమితమైందని, దీనికి కూటమి సర్కారు తీరే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

గుడారాల పండుగకు ఏర్పాట్లు



భక్తులకు పందిళ్లు వేస్తున్న దృశ్యం

అమరావతి: హోసన్న మందిరం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే గుడారాల పండుగను ఈ ఏడాది గుంటూరు శివారులోని గోరంట్ల గ్రామంలో కాకుండా మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహించాలని హోసన్న మందిరం పెద్దలు నిర్ణయించారని పాస్టర్ అనీల్ తెలిపారు. మంగళవారం ఆయన ఏర్పాట్ల గురించి వివరిస్తూ హోసన్న మందిరం వ్యవస్థాపకులు హోసన్న మొదటి చర్చి లేమల్లె గ్రామంలో నిర్మాణం చేసినందు వల్ల ఈ పవిత్ర ప్రదేశంలో 18వ గుడారాల పండుగ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. మార్చి 6వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ మధ్యాహ్నం వరకు గుడారాల పండుగ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఇచ్చే లక్షలాది మంది హోసన్నా విశ్వాసులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు వెయ్యికి పైగా మరుగుదొడ్లు, వచ్చిన విశ్వాసులందరికీ భోజన వసతి, పార్కింగ్‌తో పాటుగా వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సుమారుగా పదివేల మంది వలంటీర్లు పనిచేస్తారని అలాగే పోలీసు శాఖ వారి సహకారం తీసుకుంటామన్నారు.

గుంటూరు, విజయవాడ, సత్తెనపల్లి నుంచి గుడారాల పండుగ వేదిక వద్దకు ప్రత్యేక బస్సులు ఆర్టీసీ వారు నడుపుతారన్నారు. అనకాపల్లి నుండి భీమవరం మీదగా ఆ గుడారాల పండుగకు ప్రత్యేక రైతులు విశ్వాసులు తరలివస్తారన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుండే కాక ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుండి భక్తులు లక్షలాది మంది ఈ పండుగకు తరలి వస్తాన్నారు. ప్రార్థన వేదిక, ప్రార్థన మందిరాలను పరిశుభ్రంగా ఉంచటానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. హోసన్నా మందిరంకు సుమారు 20ఎకరాల భూమి ఉండగా మిగిలినది రైతుల నుంచి సుమారు వంద ఎకరాలు లీజుకు తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గుడారాల పండుగకు వచ్చు వీఐపీలకు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశామన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్టు

బంగారం, నగదు స్వాధీనం

నరసరావుపేట రూరల్: జిల్లాలోని పలుచోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.5 లక్షలు విలువైన బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ పి.రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టుకున్న నిందితులతో హాజరై వివరాలను వెల్లడించారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన పోతురాజు బాలకృష్ణ, యద్దల నరేంద్రసాయిలను అరెస్టు చేశామన్నారు. వీరు పగలు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ బయట, ఇళ్లల్లో ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడల్లోని బంగారు గొలుసులను లాక్కొని ఉడాయిస్తుంటారన్నారు. గతేడాది సెప్టెంబరు 15న నరసరావుపేట మండలం కాకాని గ్రామంలో సాయంత్రం సమయంలో ఊరిచివర గంగమ్మ దేవాలయం వద్ద సిమెంట్‌బల్లపై కూర్చొని ఉన్న దేవిశెట్టి లక్ష్మమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వాహనంపై వేగంగా పారిపోయారన్నారు. పెదకూరపాడు, ముప్పాళ్ల మండలం తొండపి, రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామాల్లో కూడా ఒంటరి మహిళలపై దాడులు చేసి బంగారు గొలుసులను లాక్కొని పరారయ్యారన్నారు. ఈ నేరాలపై దేవిశెట్టి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌కేటీ బైపాస్ వద్ద ఇరువురిని అరెస్టుచేసి బంగారం, నగదు స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు.

27న ఉద్యోగులు సాధారణ సెలవు వినియోగించుకోవచ్చు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ సెలవు వినియోగించుకోవచ్చని జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఓ షేక్.ఖాజావలి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రైవేటు ఉద్యోగులకు యాజమాన్యాలు అనుమతివ్వాలని సూచించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

చుండూరు(వేమూరు): డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పరీక్షలు ఏప్రిల్ 6వ తేదీన ఉంటాయని తెలిపారు. మార్కుల శాతం, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

జోరుగా పొట్టేళ్ల పందేలు



మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిషేధిత కోడి పందేలు, పొట్టేళ్ల పోటీలు జోరుగా సాగుతున్నాయి. తమ్మవరంలో మంగళవారం పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. నెల్లూరు, భీమవరం నుంచి తెప్పించిన పొట్టేళ్లతో స్థానిక నాయకులు బరులు ఏర్పాటు చేశారు. భారీ మొత్తంలో పందేలు వేశారు. పోలీసులు సైతం కన్నెత్తి కూడా చూడలేదు. యర్రబాలెం, అనమనమూరు తమ్మవరం గ్రామాల్లో నిత్యం కోడి పందేలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వీటిని అరికట్టాలని కోరుతున్నారు.

హైవేలో ప్రమాద స్థలాల పరిశీలన



రొంపిచర్ల: పల్నాడు జిల్లాలోని శ్రీ కాసుబ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం మంగళవారం పర్యటించింది. దాచేపల్లి టోల్‌గేట్ వద్ద నుండి సంతమాగులూరు అడ్డరోడ్డు వరకు ఉన్న రాష్ట్ర రహదారిలోని ప్రమాద స్థలాలను బృందం పరిశీలించింది. ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రత్యేక ప్రాంతాలను పరిశీలించి, ప్రమాదాలకు గల కారణాలను వారు పరిశీలించారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో రొంపిచర్ల ఎస్ఐ మణికృష్ణతో పాటు ఎంఐఈ అధికారులు, హైవే అధికారులు, జిల్లా ఎస్పీ నియమించిన ప్రత్యేక పోలీస్ బృందం అధికారులు ఉన్నారు.

వైభవం.. శిడి బండి సంబరం



అమ్మవారి ఆలయం ఎదురుగా శిడి ఆడిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) శిడిబుట్టలో కూర్చుని వేడుక జరిపిస్తున్న పెళ్లి కుమారుడు మౌర్యకిరణ్

ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం

ఉయ్యూరు: అశేష భక్తజన కోలాహలం.. సన్నాయి మేళాల జోరు, డప్పు వాయిద్యాల హోరు.. జై వీరమ్మ.. జైజై వీరమ్మ భక్తజన నినాదాల నడుమ.. శిడిబండి ఊరేగింపు కనుల పండువగా సాగింది. పెళ్లి కుమారుడు ఉయ్యూరు మౌర్యకిరణ్ శిడిబుట్టలో కూర్చున్న ఉత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. పారుపూడి, నెరుసు వంశస్తులు మూడు సార్లు శిడి ఆడించటంతో ఉత్సవం ముగిసింది.

నయనానందకరంగా..

ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లలో 11వ రోజు నిర్వహించే ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక మంగళవారం నయనానందకరంగా సాగింది. పాత వాటర్ ట్యాంకు రోడ్డులో ప్రత్యేకంగా తయారుచేసిన శిడిబండికి స్థానికులు పసుపునీళ్లు ఓరబోసి గుమ్మడికాయలు కట్టి, కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపుగా బయలుదేరిన శిడిబండికి దారిపొడవునా భక్తులు పువ్వులు విసురుతూ పసుపునీళ్లు ఓరబోస్తూ హారతులు పట్టారు. పూలదండలు, గుమ్మడికాయలను శిడిబండికి కట్టి భక్తిపారవశ్యం చెందారు. కాలేజ్ రోడ్డు, ప్రధాన రహదారి వెంబడి సాగిన ఊరేగింపులో అశేష భక్తజనం పాల్గొని తన్మయత్వం చెందారు.

శిడిబుట్టలో కూర్చున్న పెళ్లి కుమారుడు..

సంప్రదాయం ప్రకారం ఉయ్యూరు దళితవాడ నుంచి పెళ్లి కుమారుడు ఉయ్యూరు మౌర్య కిరణ్ ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు మౌర్య కిరణ్‌ను శిడి బుట్టలో కూర్చో బెట్టి ఆలయ ప్రదక్షిణ చేయించారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా శిడిబండిని నిలిపి మూడుసార్లు శిడి ఆడించటంతో ఉత్సవం ముగిసింది. శిడి ఆడే సమయంలో భక్తులు అరటికాయలు విసురుతూ భక్తిపారవశ్యం చెందారు. వేడుక అనంతరం పెళ్లి కుమారుడితో పాటు ఉయ్యూరు వంశస్తులు, బంధువులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో 300 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

టెలి కమ్యూనికేషన్ యాక్ట్ కింద వ్యక్తి అరెస్ట్



రాహుల్ కుమార్ సాహి (ఫైల్)



పోలీసులు స్వాధీనం చేసుకున్న సర్వర్

మంగళగిరి టౌన్ : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన రాహుల్ కుమార్ సాహిని టెలి కమ్యూనికేషన్ యాక్ట్ కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మంగళగిరి ఆటోనగర్‌లో ఓ డేటా సెంటర్‌లోని సర్వర్ సహాయంతో రాహుల్ సీబీపీఈ ఆప్టిమైజ్డ్ యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఇతను అంతర్జాతీయ కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ ఢిల్లీకి గత ఆరు నెలల్లో 70 ఫిర్యాదులు అందాయి. దీంతో టెలి కమ్యూనికేషన్‌సంస్థ విచారణ చేపట్టింది. విచారణలో మంగళగిరిలోని ఓ డేటా సెంటర్ సర్వర్ నుంచి ఈ కాల్స్ వస్తున్నట్లు నిర్ధారించారు. ఈ కంపెనీ నడుపుతున్న రాహుల్‌కుమార్‌ను సంప్రదించగా తన కంపెనీకి వంద సిప్‌లు గ్రూప్ కాల్స్ మాట్లాడడానికి అనుమతి తీసుకున్నట్లు తెలిపాడు. ఈ సిప్‌లు తీసుకోవడానికి నకిలీ జీఎస్టీ పత్రాలు, పాన్‌కార్డు అతను అందజేసినట్లు విచారణలో తేలింది. వీటిపై క్షేత్ర స్థాయిలో సక్రమంగా విచారించకుండానే జియో సంస్థ సిప్‌లు జారీ చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం. జియో సంస్థ స్టేట్ మేనేజర్ రమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది నవంబర్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాహుల్ కుమార్‌ను గోరక్‌పూర్‌లో అదుపులోకి తీసుకుని మంగళవారం కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు రాహుల్‌కు రిమాండ్ విధించింది. రాహుల్ కుమార్ మాత్రం తనకు ఇవేమీ తెలియవని, తన కాల్ సెంటర్ ఉద్యోగులే చూసుకుంటారని, తమ కంపెనీ డేటాను ఎవరో దొంగిలించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ అనే యాప్ నుంచి ఏ కంపెనీ డేటా అయినా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రాక్టికల్‌గా పోలీసులకు చూపించాడు. కంపెనీ రాహుల్ పేరు మీద ఉండడంతో బాధ్యుడిగా చేసి అతనిపై టెలి కమ్యూనికేషన్ యాక్ట్‌తోపాటు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కంపెనీలో చేస్తున్న ముఠాను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విద్యుత్ తీగలు తగిలి రైతుకు తీవ్రగాయాలు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని బొమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రైతు చీదా సుబ్బారావు తాను సాగు చేసిన కంది పంటకి కాపలాగా వెళ్ళి పంట పొలాల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఎస్సై ఎం.ఉమామహేశ్వర రావు కథనం ప్రకారం.. చీదా సుబ్బారావుకు చెందిన కంది పొలం భద్రుపాలెం–ముప్పాళ్ళ గ్రామాల మధ్య ఉంది. అయితే అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గమనించని చీదా సుబ్బారావు బహిర్భూమికి వెళ్ళగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి సంఘటన స్థలంలో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొంత సమయం గడిచిన తర్వాత స్పృహలోకి వచ్చి పడుతూ లేస్తూ వెళ్ళగా ఆ చుట్టుపక్కల పొలంలో ఉన్న రైతు ఆంజనేయులు గమనించి జరిగిన సంఘటన గురించి సెల్‌ఫోను ద్వారా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. సుబ్బారావుకు విద్యుత్‌తీగలు తగిలి తలకు, కాలికి శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.

కేంద్ర పథకాల అమలు తీరుపై ఆరా



శానంపూడిలో కేంద్రం టీం సభ్యులు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామంలో కేంద్ర టీం సభ్యులు పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో న్యూఢిల్లీ సంబోధ రీసెర్చ్ కమ్యూనికేషన్స్ ఫీల్డ్ మేనేజరు అండ్ కోఆర్డినేటరు వికాస్ మల్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రధానమంత్రి అవాస్ యోజన, స్వయ సహాయక సంఘాలు, పింఛన్ల పంపిణీ, గ్రామీణ సడక్ యోజన, గ్రామ స్వరాజ్య అభియాన్ తదితర పథకాల పురోగతిపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల నిర్వహణలో ఏమైనా ఇబ్బందులున్నాయా, అర్హులకు అందుతున్నాయా తదితరవన్నీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లా డారు. అనంతరం గ్రామంలో పర్యటించి అవాస్ యోజన పథకంలో నిర్మించిన నివాస గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు గురించి ఆరా తీశారు.